సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



గురుకులాల్లో ప్రవేశాల ప్రారంభం

గిరిజన గురుకులాల్లో 2023 - 24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

- 8లో



'కొటియా'పై కట్టుబడి ఉండాలి

కొటియా గ్రామాలపై ఇరు రాష్ట్రాలు చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు.

- 8లో

కాస్ట్యూమ్స్ కృష్ణ మృతితో విషాదఛాయలు



ప్రముఖ సినీనటుడు, నిర్మాత కాస్ట్యూమ్స్ కృష్ణ మృతితో లక్కవరపుకోట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- 8లో

ఇఫ్తార్	సహర్
సోమ (సా॥)	మంగళ (ఉ॥)
6:15	4:26

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

గజరాజుల విధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన ఖర్బూజ కాయలను చూపిస్తున్న రైతులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం పరిసర పంట పొలాల్లో ఉన్న ఖర్బూజ పంటను శనివారం అర్ధరాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. బడే శ్రీధర్, రామారావుకు సంబంధించిన 6 ఎకరాల ఖర్బూజ పంటను చిందర వందర చేశాయి. అమ్మకానికి ధరను కుదుర్చుకున్న మరునాడే పంటను ధ్వంసం చేశాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కిలో రూ.13 చొప్పున మార్కెట్‌లో ధర ఉందని, ఏనుగులు ధ్వంసం చేయడంతో రూ.5లకు కూడా అడగడం లేదని వాపోయారు. వారం రోజుల నుండి వర్షాలు కూడా కురవడంతో వర్తకులు తక్కువ ధరకు అడుగుతున్నట్లు రైతు గాంధీ తెలిపారు. శనివారం రాత్రి 12 గంటల వరకు కాపలా కాశామని తెల్లవారి చూసే సరికి కాయలను చిందర వందర చేసి ఉన్నాయని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



కొత్తపల్లిలో విద్యుత్ స్తంభాలను వేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు, కొత్తపల్లి, రావుపల్లి తదితర గ్రామాలలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు దాదాపు 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడ్డాయి. ఈ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో ఆయా గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు ఆదివారం విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభాలను వేశారు. ఈ మేరకు ఆయా గ్రామాలలో విద్యుత్‌ను పునరుద్ధరించడం జరుగుతుందని ఏఈ తెలిపారు. మండలంలో జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏఈ తెలిపారు.

ప్రత్యేక రైలుకు పార్వతీపురంలో హాల్ట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యారావు

పార్వతీపురం టౌన్: విశాఖపట్నం నుంచి వారణాసికి వెళ్లే ప్రత్యేక రైలు కొత్తగా ప్రారంభించడం అభినందనీయమని వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు అన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం సమావేశం స్థానిక ఆ సంఘం భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రైలుకు పార్వతీపురం హాల్ట్ ఇవ్వకపోవడం శోచనీయమని, దీనిపై రైల్వే డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తామన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు రక్షిత తాగునీరు ప్రతీ రోజు అందేలా మున్సిపల్ అధికారులకు లేఖలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. సమావేశంలో మాన్యం రామకృష్ణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ పేర్కొన్నారు. స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో వీర జవాన్ రైతు జగదీష్ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదీష్‌ను యువత ఆదర్శంగా తీసుకుని దేశ సేవలో మమేకం కావాలని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయాలని కోరారు.

సన్నద్ధం

పదో తరగతి పరీక్షలకు ఇటు విద్యార్థులు, అటు అధికారులు సన్నద్ధమయ్యారు. ఏడాదంతా చదివిన విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు సిద్ధం కాగా, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కనీస సదుపాయాలు అధికారులు కల్పించారు.

- నేటి నుంచి పది పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో పరీక్షలు రాయనున్న విద్యార్థులు 11,336 మంది
- జిల్లాలో 64 పరీక్ష కేంద్రాలు
- పర్యవేక్షణకు 64మంది చీఫ్ సూపరింటెండెంట్లు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పార్వతీపురం టౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఈ నెల 18 వరకు జరగనున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మండలాల వారీగా విద్యాశాఖ అధికారులు సిబ్బందిని సమాయత్తం చేసి పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నారు.

తనిఖీ బృందాల ఎంపిక

జిల్లాలో 15 మండలాల పరిధిలో 210 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 11,336 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 5,542 మంది బాలురు, 5,794 మంది బాలికలున్నారు. వీరు పరీక్షలు రాసేందుకు 64 కేంద్రాలను సిద్ధం చేశారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. పర్యవేక్షణకు 64 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఇద్దరు ఏడీఓలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

సీ కేటగిరీలో 22 కేంద్రాలు

జిల్లాలో సమస్యాత్మకంగా ఉన్న కేంద్రాలు 22 గుర్తించారు. వీటిలో గతంలో చూసిరాతలకు పాల్పడిన కేసులు నమోదయ్యాయి. ఇలాంటి సీ కేంద్రాలు పార్వతీపురం డివిజన్లో 9, పాలకొండలో 13 ఉన్నాయి. ఈసారి అక్కడ పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని డీఈఓ రమణ తెలిపారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో సరిపడా బల్లలు లేకపోతే పక్కనున్న పాఠశాలల నుంచి తీసుకొచ్చామన్నారు. తాగునీరు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి, ప్రశ్నపత్రాలు పోలీసుస్టేషన్లలో భద్రపరిచారు.

ప్రత్యేక కంట్రోల్ రూం

పార్వతీపురం మన్యం జిల్లాలో నేటి నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కొకూడదనే ఉద్దేశంతో కంట్రోల్ రూంను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం, పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు, ఇన్విజిలేటర్ల పనితీరు వంటి వాటిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టర్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వొచ్చు.

హాల్ టికెట్‌తో ఉచిత ప్రయాణం

పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు పూర్తి చర్యలు చేపట్టారు. గ్రామాల నుండి పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు హాల్ టికెట్ ఉంటే బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే వెసులబాలు కల్పించారు. బస్సు సౌకర్యం అందుబాటులో ఉండే గ్రామాల నుండి ఉదయం 8 గంటలకు బస్సులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టారు.



జిల్లా కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రం

పార్వతీపురం మన్యం జిల్లాలో...	
పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు :	11,336
జిల్లాలో పరీక్ష కేంద్రాలు	64
సీ కేటగిరీ కేంద్రాలు	22
ఇన్విజిలేటర్లు	650
చీఫ్ సూపరింటెండెంట్లు	64
కస్టోడియన్లు	22
డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు	64
రూట్ ఆఫీసర్లు:	12

144 సెక్షన్ అమలు చేస్తాం



పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తాం. కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలోపల ముగ్గురు, నలుగురు గుమిగూడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కేంద్రాలకు ఒక కిలోమీటరులోపు ఉండే జెరాక్స్ షాపులను మూసి వేసేందుకు పూర్తి చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు, గొడవలకు తావులేకుండా చర్యలు చేపట్టాం.

– ఎ.సుభాష్, డీఎస్పీ, పార్వతీపురం

ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశాం. ప్రతీ కేంద్రం వద్ద తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, డెస్కులు సమకూర్చడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పర్యవేక్షణ అధికారులను నియమించాం. విద్యార్థులు సమయానికి గ్రామాల నుండి పరీక్ష కేంద్రానికి చేరుకొనేలా ఆర్టీసీ సిబ్బందితో పూర్తి ఏర్పాట్లు చేయించాం.

– ఎస్‌డీవీ రమణ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

పార్వతీపురం: పదో తరగతి రెగ్యులర్ పరీక్షలతో పాటుగా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వాహణకు అధికారులు ఏర్పాట్లును పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం ఆశపడిన వారికి అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలో ఆపేసిన వారికోసం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అవకాశాన్ని కల్పిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు ఆరు కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 751మంది పదో తరగతి, 279మంది ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు.

రూ.2.50లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలోని మెంటాడ మండలం బుచ్చిరాజుపేటకు చెందిన తాడ్డి తిరుపతినాయుడు కుటుంబానికి రూ.2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అందించారు. పట్టణంలో తన గృహంలో తిరుపతినాయుడు కుటుంబీకులకు స్థానిక నాయకుల సమక్షంలో ఈ చెక్కును ఆదివారం అందజేశారు.

ఖాదర్‌బాబా దర్బార్‌లో ఇఫ్తార్



దశమ ఇఫ్తార్ విందును అందజేస్తున్న దర్గా దర్బార్ నిర్వహకులు

విజయనగరం టౌన్: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని స్థానిక బాబామెట్ట ఖాదర్‌బాబా దర్గా దర్బార్‌లో ఆదివారం దశమ ఇఫ్తార్ లంగర్ ఘనంగా నిర్వహించారు. దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డాక్టర్ ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్ (ఖలీల్‌బాబు) ముస్లిం సోదరులకు ప్రేమపూర్వక ఇఫ్తార్ దావత్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రంజాన్ ఉపవాస దీక్షలు చేసి న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పా టూ పరిసర ప్రాంత ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేరువైన పాలన.. సిద్ధించిన ప్రయోజనాలు

- ద్వితీయ వసంతంలోకి పార్వతీపురం మన్యం జిలా
- అడ్డంకులన్నీ అధిగమించి పురోగతిలోకి పయనం
- అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి ప్రయత్నాలు
- 'సాక్షి'తో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు నిషాంత్‌కుమార్

పార్వతీపురం మన్యం జిల్లా... ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి విడివడి ద్వితీయ వసంతంలోకి అడుగుపెడుతోంది. పాలనను చేరువ చేయాలనే సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన జిల్లాల పునర్విభజనతో గత ఏడాది ఏప్రిల్ 4వ తేదీన ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లా... అడ్డంకులన్నీ అధిగమించి పురోగతిలో పయనిస్తోంది.



సాక్షి ప్రతినిధి, విజయనగరం: అదో పనిష్మెంట్ ఏరియా... ఉద్యోగులెవరూ వెళ్లరు... వెళ్లినా ఉండలేరు... అని ప్రతిపక్ష పార్టీలవారు పెదవి విరిచారు. ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని రంగాల్లోనూ జరుగుతున్న అభివృద్ధి చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఘనత సాధించడంలో జిల్లా అధికార యంత్రాంగ రథసారథి, కలెక్టరు నిషాంత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జిల్లా తొలి వార్షికోత్సవం సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రతి మండలంపై ప్రత్యేక దృష్టి

జిల్లాల పునర్విభజనకు పూర్వం నేను అనంతపురం జిల్లాలో జాయింట్ కలెక్టరుగా పని చేశాను. అక్కడ 63 మండలాలపై ఒకేసారి దృష్టి పెట్టలేకపోయేవాళ్లం. పరిపాలన సౌలభ్యం కోసం చిన్న జిల్లాలు చేసిన తర్వాత ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలోకి వచ్చిన 15 మండలాల్లో ప్రతి మండలంపైనా ప్రత్యేక దృష్టి పెట్టడానికి వీలవుతోంది. ఏ మండలానికైనా పార్వతీపురం నుంచి రెండు గంటల్లోనే వెళ్లిరావచ్చు. ప్రతి అంశంపై పర్యవేక్షణ ఉంటోంది. సత్వరమే నిర్ణయం తీసుకుంటున్నాం. ప్రజలకు సుపరిపాలన అందించడానికి, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేర్చడానికి వీలవుతోంది.

పేదలందరికీ త్వరలోనే ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం అమల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉంది. మంజూరైన 24,743 ఇళ్లలో ఇప్పటివరకూ 9,070 ఇళ్లు పూర్తయ్యాయి. పునాది ఆపై స్థాయి నిర్మాణాల్లోనూ 70 శాతం ప్రగతితో చిత్తూరు తర్వాత ద్వితీయ స్థానంలో ఉంది. డీఆర్‌డీఏ, సెర్ప్ ద్వారా లబ్ధిదారులకు అదనంగా రూ.35 వేల చొప్పున వడ్డీలేని రుణాలను మంజూరు చేయించడంలోనూ సత్యసాయి జిల్లా తర్వాత రెండో స్థానం ఈ జిల్లాదే. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ప్రగతిపై ప్రతి వారం జరిగే సమీక్షలో టాప్ 5 జిల్లాల్లో ఉంటోంది.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ఇంతకు ముందు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్నప్పుడు ప్రజలు తమ సమస్యలను పార్వతీపురంలో సబ్‌కలెక్టరు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి విన్నవించుకునేవారు. తమకు అక్కడ ఏమాత్రం పరిష్కారం లభించలేదనకున్నా విజయనగరం కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వచ్చేది. అందుకే జిల్లా ఏర్పాటైన తొలి రోజుల్లోనే ప్రజల సమస్యలు ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టాను. పార్వతీపురం సబ్‌కలెక్టరు, పాలకొండ ఆర్‌డీవో తమ డివిజన్ల పరిధిలోని ప్రతి మండలంలోనూ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించాలని చెప్పాను. అలాగే ప్రజల విన్నపాలకు గ్రామ, వార్డు సచివాలయాల్లోను, తహసీల్దారు, ఆర్‌డీవో కార్యాలయాల్లో పరిష్కరించేలా పర్యవేక్షిస్తున్నాను. దీంతో కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనకు వచ్చే ఫిర్యాదులు, విన్నపాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. కొత్త జిల్లా ఏర్పాటైన తర్వాత గ్రీవెన్స్ సెల్‌కు నోడల్ ఆఫీసర్‌గానున్న డీఆర్‌వో 'స్పందన' ఫిర్యాదుల పరిష్కారంపై రోజూ సమీక్షిస్తున్నారు. దీంతో రీఓపెన్ అయ్యే ఫిర్యాదుల సంఖ్య ఒక శాతం కూడా ఉండట్లేదు.

మెడికల్ హబ్ దిశగా అడుగులు



పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు ద్వారా కలిగిన అత్యంత ముఖ్యమైన ప్రయోజనం సూపర్ స్పెషాలిటీ వైద్యం చేరువకావడమే. జిల్లాకొక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండాలని ప్రభుత్వం తీసుకున్న సంకల్పం మేరకు పార్వతీపురంలో రూ.600 కోట్లతో మెడికల్ కాలేజీ మంజూరైంది. భవిష్యత్తులో పార్వతీపురం ఒక మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటుంది. ప్రభుత్వం పార్వతీపురంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కూడా మంజూరు చేసింది. జీ+6 భవనానికి డ్రాయింగ్స్ కూడా ఖరారయ్యాయి. రూ.49.70 కోట్లతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ఇది పూర్తయితే ఇప్పుడున్న జిల్లా ఆస్పత్రి భవనం పూర్తిగా అవుట్ పేషెంట్ల విభాగంగా మార్పు చేస్తాం. ప్రస్తుతం దీన్ని కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా రూ.3.50 కోట్లతో ఆధునీకరిస్తున్నాం. 37 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీల్లోనూ వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారు. ఎక్కడైనా ఖాళీలు ఏర్పడినా వెంటనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. సీహెచ్‌సీల్లో కూడా స్పెషాలిటీ వైద్యులను ప్రభుత్వం నియమించేలా కృషి చేశాను. సాలూరులో వంద పడకల ఆస్పత్రి, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందేలా చూస్తున్నాం.



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్

శరవేగంగా భూముల రీసర్వే

సుదీర్ఘ కాలంగానున్న భూవివాదాలకు, అపరిష్కృత అంశాలనూ పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్–జగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమం కింద భూముల రీసర్వే చేపట్టింది. దీనిపై పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత పర్యవేక్షణ పెరిగింది. 350 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రస్తుతం 270 మంది మాత్రమే సర్వేయర్లు ఉన్నప్పటికీ శరవేగంగా చేయగలుగుతున్నాం. తొలి దశలో 102 గ్రామాల్లో అక్కడక్కడా చిన్నచిన్న తప్పులు మినహా 70 శాతం సర్వే పూర్తయ్యింది. రెండో దశలో 180 గ్రామాల్లో చేపట్టాం. డ్రోన్ ఫ్లై జిల్లా అంతటా పూర్తి చేశాం. 20 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ (సరిహద్దు రాళ్లు వేయడం) మొదలెట్టాం.

మారుమూలలకూ సెల్ సిగ్నల్స్

నీతిఆయోగ్ యాస్పిరేషనల్ డిస్ట్రిక్స్ కింద జిల్లాల విభజన తర్వాత మన రాష్ట్రం నుంచి ఎంపికైన మూడు జిల్లాల్లో వైఎస్సార్ కడప, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా ఉంది. ఈ జిల్లాలో అభివృద్ధి జరగాలంటే కమ్యూనికేషన్స్, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరమని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. తద్వారా 160 టవర్లు మంజూరయ్యాయి. ఇప్పటికీ ఫోన్ సిగ్నల్స్ పోని జనావాసాలు 330 వరకూ ఉన్నాయి. లాభసాటి కానప్పటికీ ఒక్కొక్కటీ రూ.75 లక్షల చొప్పున ఖర్చుతో ఆ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. అటవీశాఖ క్లియరెన్స్ కూడా జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించాం. ఇవన్నీ జూలై కల్లా పూర్తి చేసిన తర్వాత సెల్ ఫోన్ సిగ్నల్స్ లేని గ్రామమంటూ ఉండదు. జిల్లా ఏర్పాటు తర్వాత కలిగిన ప్రయోజనాల్లో ఇదొకటి.

రూ.వెయ్యి కోట్లతో రహదారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాల కింద రోడ్ల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్ల వరకూ నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే ఆరు రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ జిల్లా స్థాయిలోనే చేసేశాం. ఇంకా ఎక్కడైనా గ్రామాల వారు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నా, వాగులను దాటలేక విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నా వెంటనే అక్కడ వంతెనలు, రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా మన జిల్లాకు రూ.100 కోట్లు మంజూరు చేశారు.

జిల్లా కేంద్రం మీదుగా జాతీయ రహదారి

విశాఖ నుంచి రాయ్‌పూర్ వరకూ నిర్మాణమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే మన జిల్లాలో పాచిపెంట మండలం మీదుగా వెళ్తుంది. ఇది పూర్తయితే రాయ్‌పూర్ మీదుగా న్యూఢిల్లీకి కనెక్టవిటీ వస్తుంది. రాష్ట్రంలో జాతీయ రహదారి అనుసంధానం కాని జిల్లా కేంద్రం మనదొక్కటే. అందుకే ఒడిశాలోని రాయ్‌గఢ్ నుంచి కూనేరు, పార్వతీపురం మీదుగా రామభద్రపురం వరకూ జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

పర్యాటక అభివృద్ధికి అవకాశాలెన్నో..

పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లాలో ఎన్నో అందమైన ప్రదేశాలు, అవకాశమున్న ప్రాంతాలు ఉన్నాయి. పర్యాటకుల రాకపోకలకు వీలుగా అరకు నుంచి ఇచ్ఛాపురం వరకూ ఈస్టర్న్‌ఘాట్ కారిడార్ పేరుతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాను. ఇది మూడు నాలుగు జాతీయ రహదారులను కలుపుతూ వెళ్తుంది. ఇది సాకారమైతే పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వందకు పైగా పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యం కలుగుతుంది.

మరిన్ని రైళ్లు

పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం 24 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఉంది. టిట్లాగఢ్ నుంచి విజయనగరం వరకూ రూ.2,335 కోట్లతో 265 కి.మీ పొడవున తలపెట్టిన మూడో రైల్వే లైను నిర్మాణ పనులు పూర్తయితే మరో నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి వస్తాయి.

పారిశ్రామిక రంగానికి ఊతం

కొత్త జిల్లాలో పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేలా చర్యలు చేపట్టాం. గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలో పాచిపెంట మండలంలోని కొక్కిటిపెంట గ్రామం వద్ద వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

క్లుప్తంగా

రామతీర్థంలో ప్రత్యేక పూజలు


స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామ దేవస్థానంలో ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో ఆదిత్యహృదయం హోమం చేశారు. అనంతరం ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం: భార్య సరదాగా ఉండడంలేదని మనస్తాపం చెందిన సీతానగరం మండలం బక్కుపేటకు చెందిన బి.శ్రీనివాసరావు పురుగు మందు తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. భర్త పురుగు మందు తాగిన విషయం గమనించిన భార్య స్థానికుల సహాయంతో 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించింది. ఈ మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

యల్లారమ్మ ఆలయంలో హుండీలో నగదు చోరీ


ఆలయంలో చోరీకి గురైన హుండీ

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ ఆలయంలో హుండీలోని నగదు చోరీకి గురైంది. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఆలయ పూజారి దుర్గారావు ఆదివారం ఎప్పటిలాగానే ఆలయానికి వెళ్లేసరికి గేటుకు ఉన్న తాళాలు లేకపోవడంతో ఎండోమెంట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఈఓ ప్రసాద్ ఆలయానికి చేరుకుని పరిశీలించి హుండీ చోరీకి గురైందని తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీసీఎస్ ఎస్సై సుదర్శన్ ఘటనాస్థలానికి వచ్చి జరిగిన ఘటనపై ఎండోమెంట్ అధికారులు, ఆలయ పూజారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హుండీ పైకప్పు ఆలయం పక్కనే పడేసి ఉండడం గమనించారు. హుండీలో నగదు సుమారు రూ.70వేల నుంచి 80 వేలు ఉంటుందని ఈఓ తెలిపారు. విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి ఆలయం గేట్లు, హుండీ తదితర ప్రాంతాలు వద్ద వేలిముద్రలు సేకరించారు.

ఇంటర్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్ కోర్సు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్ ద్వారా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్ అనే నూతన కోర్సు ప్రవేశపెట్టినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, కంప్యూటర్ స్కిల్స్, వైద్య సంబంధిత పాఠ్యాంశాలతో పాటు ప్రాథమిక వైద్య చికిత్స విధానాలను నేర్పిస్తామని పేర్కొన్నారు. బీఎస్సీ పారామెడికల్ డిగ్రీ కోర్సులు, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీతో పాటు 12 పారామెడికల్ కోర్సుల్లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9121999654, 7680945357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

గిరిజన గురుకులాల్లో ప్రవేశాల ప్రారంభం

- ఐదో తరగతిలో 560 సీట్లు
- 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు 132కు నోటిఫికేషన్
- ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెల 7న ప్రవేశ పరీక్ష

షెడ్యూల్ ఇలా...

దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: 30.04.2023.
ప్రవేశపరీక్ష తేదీ: 07.05.2023
మెరిట్ జాబితా తయారీ : 15.05.2023
మెరిట్ జాబితా ప్రదర్శన: 22.05.2023
కాల్ లెటర్లు పంపించే తేదీ: 22.05.2023



సీతంపేటలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల

సీతంపేట: గిరిజన గురుకులాల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఐదో తరగతిలో పూర్తి స్థాయిలో సీట్లు భర్తీకి, అలాగే 6 నుంచి 9 తరగతులకు బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేయనున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో పెద్దమడి, సీతంపేట బాలురు, బాలికలు, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో భద్రగిరి, పి.కోనవలస, కొమరాడ, కురుపాం గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మొత్తం 560 సీట్లుకు రిజర్వేషన్ పాటించనున్నారు. ఒక్కో పాఠశాలలో ఐదులో 80 సీట్లుకుగాను ఎస్టీకి 78 శాతం, ఓసీకి 2 శాతం, ఎస్సీ 12 శాతం, బీసీ 5 శాతం, ఏఈక్యూ (ఏజెన్సీ ఎంప్లాయి కోటా) 3 శాతం సీట్లు కేటాయించారు. 6 నుంచి 9 తరగతుల మిగులు సీట్లు 132 గిరిజన విద్యార్థులకు మాత్రమే ఎంట్రన్స్ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు. రాత పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి సీటు లభించనుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి

విద్యార్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.గవ్.ఇన్‌కు దరఖాస్తు చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదు. ఐదో తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన స్కూల్స్‌లో చదివి 01.06.2012 నుంచి 31.05.2014 మధ్య జన్మించి ఉండాలి.

వివిధ గురుకులాల్లో తరగతుల వారీ సీట్ల వివరాలు..

పాఠశాల	5వ తరగతి	6వ తరగతి	7వ తరగతి	8వ తరగతి	9వ తరగతి
సీతంపేటబాలురు	80	36	1	8	12
సీతంపేట బాలికలు	80	0	1	0	0
పెద్దమడి	80	34	6	0	0
బద్రగిరి	80	2	4	1	2
పి.కోనవలస	80	4	2	0	0
కొమరాడ	80	0	0	0	0
కురుపాం	80	11	1	4	3
మొత్తం	560	87	15	13	17

నిరుపేద విద్యార్థులకు మంచి అవకాశం



నిరుపేద గిరిజన విద్యార్థులకు మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని బాగా చదివితే సీటు లభిస్తుంది. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం జరుగుతుంది. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించబడతాయి.

– కె.సురేష్, కన్వీనర్ ప్రిన్సిపాల్,సీతంపేట ఐటీడీఏ

‘కొటియా’పై కట్టుబడి ఉండాలి

- కేంద్ర మంత్రి మాటలపై ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాలపై సుప్రీంకోర్టు స్టేటస్ ఉన్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు కమిటీలను నియమించి చర్చలతో సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. తన స్వగృహంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. ఈ గ్రామాలకు సంబంధించి ఇటీవల కేంద్ర మంత్రి దేవేంద్రప్రధాన్ మాటలు సరికాదన్నారు. కొటియా గ్రామాలు ఒడిశావే అంటూ పేర్కొనడం తగదన్నారు. కేంద్ర మంత్రి దేశంలో అన్ని ప్రాంతాలను సమానంగా చూడాల్సి ఉందన్నారు. కేంద్ర మంత్రి మాటలు కోర్టు ధిక్కారణ అవుతుందన్నారు. కొటియా గ్రామాల వివాదంపై 1968లో సుప్రీం కోర్టు స్టేటస్ కో విధించిందన్నారు. ఇరు రాష్ట్రాలకు సమాన హక్కులు ఉంటాయని తెలిపిందని చెప్పారు. అంత వరకు ఇరు రాష్ట్రాలు అక్కడ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారని వెల్లడించారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చాలా గౌరవం, అభిమానం ఉందని తెలిపారు. ఆంధ్రా – ఒడిశా మధ్య దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి రెండేళ్ల కిందట ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్‌మోహన్‌రెడ్డి, నవీన్ పట్నాయక్ చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, సామరస్య వాతావరణంలో కొటియా, పలు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చట్టాలను, రాజ్యాంగాన్ని గౌరవించని వారికి సరైన సమయంలో అవే బుద్ధి చెబుతాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సంఘటన స్థలంలో మృతిచెందిన దాలినాయుడు

గంట్యాడ: మండలంలోని కొత్త వెలగాడ గ్రామానికి చెందిన రాజాన దాలినాయుడు (34) ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాలినాయుడు బోనంగి గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో మోకాలపాడు జంక్షన్ వద్ద బోర్డును ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచార మేరకు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పొట్టేళ్ల పందాల రాయుళ్లపై కేసు నమోదు


పోలీసులు అదుపులోకి తీసుకున్న పందారాయుళ్లతో పాటు పొట్టేళ్లు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామంలో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై ఆదివారం తెల్లవారుజామున దోనుబాయి ఎస్సై కిశోర్‌వర్మ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు.ఈ దాడుల్లో రెండు పొట్టేళ్లు, రూ.2 వేలు స్వాధీనం చేసుకుని ఏడుగురు పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.పేకాట శిబిరాలు నిర్వహించడం, పొట్టేళ్ల పందేలు జరిపించడం, క్రికెట్ బెట్టింగ్‌లు తదితర అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ఆటోలు ఢీకొని ఏడుగురికి గాయాలు


బొండపల్లి: క్షతగాత్రుడు ప్రసాద్‌కు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం వద్ద ఆదివారం రెండు ఆటోలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాల పాలైన గుర్ల గ్రామానికి చెందిన సారిక రాజేశ్వరి, సారిక హైమవతిలను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

రెండు బొలెరోలు ఢీకొని ఒకరికి..

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బొలెరో వ్యాన్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న వ్యాన్, విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న రెండు వ్యాన్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మజ్జి ప్రసాద్(28)తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

వసుధైక భావనే ప్రపంచానికి దిక్సూచి


సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

- వివేకానంద కేంద్రం సంఘటక్ సుజాత నాయక్



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: విస్తారమైన దేశంలో గల భారతీయ సనాతన వ్యవస్థలో వైవిధ్యం ఎంతో స్ఫూర్తివంతమైనదని స్వామి వివేకానంద కేంద్రం తెలుగు రాష్ట్రాల ప్రాంత సంఘటక్ సుజాత నాయక్ అన్నారు. అంతా ఒక్కటనే వసుధైక కుటుంబ భావనే ప్రపంచానికి దిక్సూచి కాగలదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో జీ-20 సదస్సులో భాగాంగా పార్వతీపురంలోని జట్టు ఆశ్రమంలో సివిల్ సొసైటీ-20 చర్చా వేదికను ఆదివారం నిర్వహించారు. జట్టు నిర్వాహకురాలు పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవ శరీరంలో ఏ రెండు అవయవాలు ఒకదానితో మరొకటి సమానంగా ఉండవని, అయితే ప్రతి అవయవం తనదైన పనిలో కీలకమైనదేనని గుర్తు చేశారు. అలాగే అన్ని ప్రాంతాలు, వర్గాల పరస్పర గౌరవం, సమన్వయంతోనే సమాజ ప్రగతి సాధ్యపడుతుందని తెలిపారు. అంతా మనం, మనవారనే భారతీయ తాత్విక చింతనే వసుధైక కుటుంబ భావన అని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

భారతీయతతో ప్రపంచాన్ని అనుసంధానం చేయడం, జనజీవనాన్ని అందులో భాగస్వామ్యం చేయడమే సివిల్ సొసైటీ-20 లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం సంస్కృతి, విద్య, వ్యవసాయ రంగాల ద్వారా చేరుకోగల మార్గాలపై చర్చించి, పలు ప్రతిపాదనలను జీ-20 సమన్వయకర్తలకు పంపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ వీఎస్ఎన్ కుమార్, దుర్గా బాబాజీ, లక్ష్మీ నారాయణ, రవికుమార్, పారినాయుడు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

నమో ఆదిత్యాయ..!

- అరసవల్లిలో భక్తజనం ప్రత్యేక పూజలు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు


సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. చైత్ర శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ.2.44 లక్షలు, విరాళాలు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా రూ.73,161, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.10 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారులు

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పలువురు ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అట్టాడ సిరి, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.అమరావతి రాజధాని లక్ష్యంగా కొందరు ఉద్యమకారులు ప్రత్యేక బస్సుల్లో అరసవల్లి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, పరిపాలనాధికారి కిల్లారి రామారావు, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, వీఆర్వో చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్‌లో నూతన ఒరవడికి శ్రీకారం


ఎస్‌వీఎన్ స్వప్నలోక్ వెంచర్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

- ఘనంగా ఎస్‌వీఎన్ స్వప్నలోక్ రియల్ ఎస్టేట్ వెంచర్ ప్రారంభం

విజయనగరం: రియల్ ఎస్టేట్ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ఎస్‌వీఎన్ శ్రీనివాసా సుజాత గ్రూప్ కృషి అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ మేరకు ఆదివారం ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని తాటిపూడి రిజర్వాయర్ సమీపంలో 160 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఎస్‌వీ ఎన్ శ్రీనివాస సుజాత గ్రూప్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వీఎన్ స్వప్నలోక్ రియల్ ఎస్టేట్ నూతన వెంచర్ ప్రారంభ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, రాష్ట్ర మేరిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డిలు వెంచర్ బ్రోచర్, వెబ్‌సైట్‌లను ఆవిష్కరించారు.

అన్ని వసతులతో వెంచర్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధానిగా రూపాంతరం చెందుతున్న తరుణంతో పాటు భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అరకు, అనంతగిరి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్న తాటిపూడి ప్రాంతంలో నూతన వెంచర్ చేయడం శుభపరిణామంగా పేర్కొన్నారు. సుమారు 160 ఎకరాలలో అందర్నీ ఆహ్లాదపరిచే రీతిలో, అందరికీ ఆమోదయోగ్యమైన ధరలో అన్ని రకాల వసతులతో వెంచర్‌ను వేయడం సాహసోపేత నిర్ణయమని ప్రశంసించారు. ఈ నూతన వెంచర్ పక్కనే సుమారు 1200 ఎకరాలలో జిందాల్ పరిశ్రమ రాబోతోందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జి శ్రీనివాసరావు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన వెంకటరాము నాయుడు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఇసరాపు రేవతి దేవి, మాజీ శాసనమండలి సభ్యుడు గాదె శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

కాస్ట్యూమ్స్ కృష్ణ మృతితో ఎల్.కోటలో విషాదఛాయలు


కాస్ట్యూమ్స్ కృష్ణ (ఫైల్)


ఎల్.కోట జంక్షన్‌లో ఆయన నిర్మించిన బస్‌షెల్టర్

లక్కవరపుకోట: ప్రముఖ సినీనటుడు, నిర్మాత కాస్ట్యూమ్స్ కృష్ణ మృతితో లక్కవరపుకోట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కృష్ణ స్వస్థలం లక్కవరపుకోట గ్రామంలోని జామివీధి. ఆయన చిన్నప్పుడే మంచి టైలరింగ్ చేస్తూ ఉండేవారని అప్పట్లో బతుకు తెరువుకోసం చెన్నై వెళ్లిపోయారని ఆయన బాల్యమిత్రులు తెలిపారు. అక్కడ సినీ ఇండస్ట్రీలో ‘ముద్దుబిడ్డ’ సినిమాకు కాస్ట్యూమ్స్ అందించారని చెప్పారు. అనంతరం భారత్‌బంద్ చిత్రంతో నటనా రంగంలోకి అడుగు పెట్టారని పెళ్లిపందిరి సినిమాతో నిర్మాణ రంగంలోనికి అడుగు పెట్టినట్లు దగ్గరి బంధువులు తెలిపారు. ఆయన ఎక్కడికి వెళ్లినా కన్న ఊరిని మర్చిపోలేదని గుర్తు చేసుకున్నారు. ఆయన తల్లి చినతల్లమ్మ పేరు మీద అరకు–విశాఖ రోడ్డులో ఎల్.కోట జంక్షన్ వద్ద బస్‌షెల్టర్‌ను 1996లో నిర్మించారు. అలాగే ఆయన చిన్నప్పుడు ఉండే ఇల్లు శిథిలమైపోవడంతో ఆ స్థలాన్ని గౌరమ్మ అమ్మవారి గుడి నిర్మాణానికి విరాళంగా అందజేశారన్నారు. అప్పుడు అప్పుడు ఎల్.కోట వచ్చి తనకు వారసత్వంగా వచ్చిన పంట భూములను చూసుకుంటూ వెళ్లేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

తైక్వాండోలో విజయనగరం క్రీడాకారుల హవా


జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాజస్థాన్ రాష్ట్రంలోని కోట యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మార్చి నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ క్యాడెట్ పోటీల్లో విజయనగరానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు సీహెచ్ హర్షవర్ధన, బి యశస్విని, ఎం షణ్ముఖ సిద్ధార్థ వివిధ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో మూడు పతకాలు రావడం ఇదే మొదటి సారి అని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. సీహెచ్ వేణుగోపాలరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 20 సంవత్సరాలుగా తైక్వాండో క్రీడను విజయనగరం జిల్లాలో నేర్పిస్తున్నానని అంతేకాకుండా స్పోర్ట్స్ కోటాలో చాలావరకు ఉద్యోగాలు కూడా వచ్చాయని, అయితే జాతీయ స్థాయిలో మూడు పతకాలు రావడం అంతులేని ఆనందాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తానని చెప్పారు. వారి విజయం పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. సుమారు 65 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రిలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్సై అశోక్ కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం